

# గుమస్తా గంగరాజు

గమ్మల భాస్కరరావు

గంగరాజు—ప్రజల అవసరాలని, ఆపదలని కష్ చేసుకునే ఒకానొక డిపార్టుమెంటులో కొత్తగా క్లర్క్‌గా చేరాడు. కొత్తగాబట్టి అతనికి డిస్పాచ్ సీటు యిచ్చారు. ఆఫీసు కాగితాలకి వాటి రాకపోక

# పాప పరిహారం కథ

లకి అది ట్రాఫిక్ పోలీసుద్యోగం. బొత్తిగా డ్రై సీటు. ప్రతి సీటులో అంతో యింతో డబ్బు మో[illegible]స్తుంది. చివరికి ఫ్యాన్ల చేతులు కూడా చెమర్చుతాయి. డిస్పాచ్ సీటు మటుకు తరతరాల నించీ అంటరాని సీటుగా ఉండి పోయింది. అందరికీ ఆ సీటుమీద ఎంతో సానుభూతి వుంది. అత్తా ఒకింటి కోడలే అన్నట్టు ప్రతి గుమస్తా ఒకనాటి డిస్పాచ్ క్లర్కే!

"గుండె నిబ్బరంతో వుండు బ్రదర్! కొత్తవాడెవడైనా చేరితే నీ బరువు తొలగుతుంది, కరువు తీరుతుంది" అని ధైర్యం చెప్పారు గంగరాజుకి ఇతర క్లర్కులు.

'పై పాటు' దృష్ట్యా మరో డిపార్టుమెంటులో ఆఫీసరు చెయ్యడంకంటె ఆ డిపార్టుమెంటులో 'ఫ్యాన్' మేలని ఏరి కోరి తన కొడుకుని గుమస్తాగా వేయించాడు—శివయ్య.

గంగరాజు - శివయ్య కలలపంట.

శివయ్య అప్పట్లో గోదావరిదో-కృష్ణదో—ఓ కాలువకి-ఓ లాక్ మీద సూపర్నెంటు చేసి పదేళ్ళ క్రితం రిటైరయ్యాడు. ఎత్తయిన దిబ్బమీద కోట గుమ్మాల్లాంటి లాకు తలుపులు ప్రవహించే కాలువకి అడ్డం. వుంటే-అడ్డున్నవి తలుపులు కావు, శివయ్యే కాలువకి అడ్డంగా శేషతల్ప శాయిలా పడుకుని చలాయిస్తున్నాడు అనేవారు లాకు బాధితులు. అతను నదీజలాలు ఏజన్సీకి పుచ్చుకుని రిటైలుగా-కాలువల్లోకి పారించి అమ్ముకుంటున్నాడేమో ననిపించేది. లాకు కింద పొలాలన్నీ తనవేనన్నంత ధీమాగా ఉండేవాడు. 'లాకు' అటు యిటూ పడవలు ఆగిపోయి గిజగిజలాడి పోతుంటే శివయ్య నిర్వికారంగా కూర్చునేవాడు. పడవలు తృణమో పణమో—తులాల లెక్కన గాక, పీశెలు కుంచాలు స్థాయిలో సమర్పించుకుని లాకులు దాటేవి. అంతెందుకు! శివయ్య కనుసన్నల్లో లాకులు తెరుచుకునేవి. మూసుకునేవి. లాకు దిబ్బ అతని

సామ్రాజ్యం. నలుగురు కళాసీలు అతని మందీ మార్బలం. లాకు కాలువగట్టుమీద అటవీ సంపద అతనిది. ఏతావాతా పది ఎకరాలు పల్లం కాని 'బాక్ గ్రౌండ్' లో పడేసి, లంక పుగాకు చుట్టలు తాపీగా కాల్చడం నేర్చుకున్నాడు.

పైసా పెట్టుబడి లేకుండా.... వెధవ .... గాలి .... నీరులాంటి సహజవనరుల్ని ఆటకాయిస్తే నే పుసుపుల డబ్బు చేసుకోవచ్చనే- యిక ప్రపంచంలో పై సంపాదనకి సంబంధించిన ఉద్యోగాలు ఏవి వున్నాయో విస్తృతంగా ఆలోచించాడు. అవి తెల్పిన వాళ్ళని వాకబు చేసాడు శివయ్య.

జీతం డబ్బులు బియ్యానికి చాలనివాళ్ళు లంచాలతో బంగారు కంచాలలో మేస్తున్న ఉదంతాలు విన్నాడు. కీలకమైన స్థానాల్లో గుమస్తాలు కొందరు 'ప్రెసిడెంట్'ని తలదన్ని సంపాదిస్తున్న తీరు తెన్నులు తెలుసుకున్నాడు. వాళ్ళ స్థిరచరాస్తులు అలా వ్యాపించి ఊళ్ళూ కోళ్ళూ మింగెయ్యవుకదా! అని విస్తుపోయాడు. 'పై సంపాదనలేని ఉద్యోగాలు వ్యర్థం. వాళ్ళవి అణాకానీ బతుకులు. అబ్బాయి చొరవ తనకి తెలుసు. తను ఊళ్ళో లేనపుడు వాడు దళాయించి తన వసూళ్ళ డ్యూటీ చేసిన ఘనత మర్చిపోలేదు.'

ఏమైనా సరే తన కొడుకుని గుమస్తా చెయ్యాలనుకున్నాడు. చివరికి గంగరాజుని గుమస్తాకి పరిపద్దా కాలేజీలో చదివించాడు.

* * *

అదో పెద్ద హాలు.

ఆఫీసుకి తగ్గ అన్ని హంగులు సంతరించుకుని - సంతలా ఓసారి. సత్రం లా ఓసారి- బస్సుల్లేని బస్టాండులా ఓసారి కనిపిస్తుంది. నిత్యం తీర్థప్రజలా జనసందోహం. ఎవరు గుమస్తాలో, ఎవరు పార్టీలో తెలీదు.

అందులో గంగరాజు డిస్పాచ్ క్లర్కు. హాలులో ఓ మూలకి విసిరికొట్టినట్టున్నా.... అతను సీట్లో కూర్చుంటే ఆఫీసు కార్యకలాపాలు అన్నీ గమనించగలడు. అతనిది పెద్ద పని కాదు. ఉదయం టపా వచ్చినపుడు, సాయంత్రం టపా సంపేటప్పుడు చెరో గంట ఊపిరాడని పని మినహాయిస్తే అంతా ఖాళీ. ఈ ఖాళీ దొరికినందుకు కొందరైతే 'నెయిల్ కట్టర్సు' వాడేవారు. ఇంతకు ముందువాడు గాజు పేపర్ వెయిట్లు బద్దలుకొట్టి అందులో రంగు పూలు

అన్వేషించేవాడు-అదో మానియా-పాపం!

గంగరాజు అలా చెయ్యలేదు. దొరికిన ఖాళీ వి కళ్ళకద్దుకుని వినియోగించుకున్నాడు. ఆఫీసులో ఏ మంత్రాంగాలు జరుగుతున్నాయో-ఏ గుమస్తాకి పార్టీకి మధ్య మంతనాలు జరుగుతున్నాయో క్షుణ్ణంగా పరిశీలించేవాడు. 'నోట్ల కవర్లు' బల్లకింద నించి చేతులు మారుతుంటే పెదాలు తడుపుకునేవాడు. ఓ ఫైలు డిస్పాచ్‌కి వెళ్ళేలోగా-ఎలా పెరిగిందీ ఎంత కతికి ఆ స్టేజికి వచ్చిందీ, పాపం ఎంత ప్రసవవేదన పడిందీ గ్రహించగలిగాడు. రైలుబొగ్గు తోడే పొడుగాటి పారలతో దోచుకుంటున్న గుమస్తాల నిత్యనృత్యం గమనించాడు.

ఈ గందరగోళానికి అతీతంగా ఆ హాల్లో మరోమూల సౌండ్ ప్రూఫ్ గదిలో-ఆఫీసరు ఛాంబర్ వుంది. అందులో రివాల్వింగ్ చెయిర్లో ఆఫీసరు ఫోన్ కాల్స్‌మీద, సంతకాల మీద బతుకుతుంటాడు. ఆయనో సంతకాల మెషిన్. కాగితాలు అయిపోతే-సంతకాలకి మరికొన్ని కాగితాలకోసం విసుగ్గా బెల్ నొక్కుతాడు. బెల్‌కంటె ఫ్యాన్ వేగంగా కదులుతాడు. అతను గుమస్తాలకీ, ఆఫీసరుకి మధ్య వారధి.

వారధి ద్వారా ఆఫీసరు వివరాలు సేకరించాడు గంగరాజు.

ఆఫీసర్‌గారికి అదేదో జాబ్ పిచ్చట. ఆయనకి డబ్బు తీసుకునే ఉద్దేశం లేదట. కానీ యింటిదగ్గర ఫామిలీ 'శతపోరట.'

గంగరాజు డిస్పాచ్ కెరీర్‌లో చాలా గ్రహించాడు. గుడ్డిగా కాగితాలు డిస్పాచ్ చెయ్యకుండా ప్రతి కాగితం పుట్టుపూర్వోత్తరాలు, పరిణామ క్రమాలు ఆకళింపు చేసుకున్నాడు.

* * *

ఆర్నెల్లు గడిచాయి.

గంగరాజు డిస్పాచ్ సీట్లో వుంటూ ఆఫీసు పనిలో నిష్ణాతుడై పోయాడు. అతనికి 'పని' యావత్తూ తెలిసిందన్న విషయం ఎవరికీ తెలీదు. విజ్ఞాన సర్వస్వం గుండెల్లో దాచుకుని తన వంతు దోపిడీకి ఎదురు చూస్తూ క్షణమొక యుగంగా గడపసాగాడు. ఆ శుభ ఘడియ వచ్చేవరకూ-ఎడా పెడా కాగితాలు, స్టాంపులు, కవర్లు, ముద్రలు, ఎకానమీస్లిప్పులు-వీటితోనే పని.

గంగరాజు ఆ నెల మొదటి రోజున జీతం తండ్రి చేతుల్లో పోస్తే

శివయ్య పెదవి విరిచాడు.

"అదేమిటి నాన్నా?"

"ఈ విషయంలో పొరబడ్డానేమో అనిపిస్తుంది బాబూ! నిన్ను డాక్టరీయో, ఇంజనీరింగో చదివించాల్సింది. అత్యాశకు పోయి గుమస్తా చేయించాను."

"యిప్పుడేం మించిపోయింది నాన్నా?"

"ఏదీ? ఉద్యోగం వచ్చి ఆరు నెల్లు కావస్తున్నా ఒక్క 'పావలా' అదనంగా సంపాదించిన పాపాన పోలేదు. ఆ 'పావలా' నాకు యివ్వక్కర్లేదు. నీ పెళ్ళానికి మల్లెపూలు కొనిపెట్టు. అదే నాకు తృప్తి."

పెళ్ళి విషయం ఎత్తినందుకు సిగ్గు ముంచుకొచ్చింది. సంపాయించలేని పనటను చేసినందుకు రోషమూ వచ్చింది. సిగ్గెగిరిపోయింది, రోషం నిలబడింది.

"క్షమించు నాన్నా! నీ కొడుకు అప్రయోజకుడు కాడు. ఎప్పటికైనా నీ అంతటివాడినౌతా" అన్నాడు.

శివయ్య "తప్పు. నా అంతటివాడివైతే నీకేం మిగులుతుంది? నేను రిటైరయాతే-లాకులు—నాకు మిగిలాయా? తిరిగి ప్రభుత్వానికిచ్చెయ్యలేదూ? నాతో పోల్చుకోకు. నన్ను మెట్యొంతలు మించిపోవాలి. అదే నా కోరిక" అన్నాడు.

గంగరాజు కళ్ళు చెమర్చాయి. తండ్రి ఆదర్శం అర్థం అయింది. ఆ మేరకి ఆత్మవిశ్వాసం నింపుకున్నాడు.

'కలిసొచ్చే కాలమొస్తే నడిచి వచ్చే కొడుకు పుడతాడని' నానుడి. గంగరాజు ఎదురు చూసిన రోజు ముంచుకొచ్చింది.

బీ-వన్ క్లర్క్ ఆ రోజు సెలవుపెట్టడంతో ఆఫీసర్ కంతా నికి ఉరితాడు బిగిసింది. చాలా ముఖ్యమైన స్టేట్‌మెంట్సు ఆగిపోయాయి. బీ-వన్ సీట్లో యిరుక్కుపోయాయి. అవి తయారు చెయ్యడం అతనొక్కడికే తెలుసు. అవాళ బెల్లు పదే పదే మోగింది. గుమస్తాలంతా "మాకా 'వర్క్' తెలీద్సార్!" అని ఒన్‌బై వన్ చెప్పారు. గదిలో ఎవరూ లేనప్పుడు "నాకు తెలుసు. మీరంతా యూస్లెస్ ఫెలోస్!" అని ధైర్యంగా అరుస్తున్న సమయంలో గంగరాజు చెప్పాపెట్టకుండా దూసుకు వచ్చాడు - "ఎక్స్క్యూజ్‌మీ సర్!" అన్నాడు.

"ఏం నువ్వు చేస్తావా?" అన్నాడాయన హేళనగా.

"యస్సార్. నాకో అవకాశం ఇప్పించండి!"

"సరే-కానియ్. చూస్తా."

బీ వన్—సీటు తెరిపించి గంగరాజు స్టేట్‌మెంట్సు తయారు చెయ్యడానికి పూనుకుంటే-అందరూ అవాక్కయి పోయారు. ప్రయత్నిస్తే ఒకరిద్దరికి ఆ పని తెలీక పోదు. కానీ ఒకరి పని ఒకరు ముట్టుకో కూడదని .... కట్టుబాటు. ఒకరి డబ్బులు మరొకరు పాములా భావించాలని నియమం. వాళ్ళు ఆశ్చర్యంతోబాటు అలాగే బిగుసుకుపోయేలా - గంగరాజు గంట మించకుండా కాగితాలు పూర్తిచేసి ఆఫీసరు ముందుంచాడు.

ఆయన కళ్ళు పెద్దవి చేసి "శభాష్!" అన్నాడు.

"థాంక్యూ సర్!"

"ఏ వూరు?"-చెప్పాడు. "మీ ఫాదర్?" - చెప్పాడు. "పెళ్ళయిందా?"-చెప్పలేదు, తల వంచుకున్నాడు.

"ఆల్‌రైట్! చూడూ, బీ-వన్ వచ్చేవరకూ ఆ సీటు నువ్వే చూడాలి."

"యస్సార్. థాంక్యూ సర్!"

"థాంక్సు ఎందుకోయ్ పిచ్చివాడా! అడిషనల్ బర్డెన్ కదుటోయ్! ఒహోహో, అదా - అర్థమయింది. కానీ జాగ్రత్త సుమా!" అన్నాడు.

అనుకోకుండా గంగరాజు బనీన్లోంచి బైటకొచ్చిన లాకెట్ చూసి ఆఫీసర్ "అరె! నువ్వు కూడా మా బాబాగారి భక్తుడివేనా!" అన్నాడు.

"అవును సార్!" అన్నాడు అర్ధనిమీలితనేత్రుడై.

"వెల్" అంటూ తన లాకెట్ బైటకు తీసి కళ్ళకద్దుకున్నాడాఫీసర్.

బైటికి వచ్చి లాకెట్ ముద్దు పెట్టుకున్నాడు గంగరాజు. అతను భక్తుడు కాదు, బూడిద కాదు. ఆయన సంగతి తెలుసుకుని తనొకటి తగిలించుకున్నాడు. ప్రయత్న పూర్వకంగా పవిట జారవిడిచిన దానిలా-ఎక్కడో బనీన్లో వున్న లాకెట్ బైటపడేలా వదిలాడు. తన పాచిక పారింది. ఆఫీసర్‌గారి అభిమానం దొరికింది.

కొత్త సీటులో పని ప్రారంభించాక అల్మైరాలో అతనికి 'చిట్టా అవర్జా'లాంటి లిస్టు దొరికింది. పూర్వపు గుమస్తా అదేదో 'కోడ్'లో రాసి పెట్టుకున్నాడు.

అవులిస్తే పేగులు లెక్కపెట్టే విద్య నేర్చుకున్నవాడికి కోడ్ భేదించగలగడం కష్టం కాలేదు. ఆ

లిస్టులో పార్టీల పేర్లు, మామూళ్ళ డ్యూ డేట్లు-అన్నీ వివరంగా రాసి వున్నాయి. అది సంవత్సరాంతం అవడంతో గంగరాజు పంట పండింది. వెంటనే పార్టీలకి నోటీసులు జారీచేసి వలపన్నాడు.

ఇంతకుముందు గుమస్తావల్ల పనై బీర్వాలో దాగిన కాగితం వెలికి తీసి-ఆ పని తను చేసినట్టు నటించినందుకు వంద సంపాదించాడు. తొలి వంద! అదే మొదటి సంపాదన! జీతం ఎంతైనా 'పై పరక' లో ఎంత తీపి వుందో ఆ రోజున గ్రహించాడు గంగరాజు. సాయంత్రం పరుగున ఇంటికి వెళ్ళి తండ్రి చేతిలో 'వంద' వుంచి కాళ్ళకి నమస్కరించాడు.

కొడుకు నెలకి నాలుగువందల జీతం తన చేతుల్లో పోస్తుంటే.... ఈషణ్మాత్రం పొందని ఆనందం ఆ పై వంద చూసేసరికి శివయ్య ఉబ్బితబ్బిబ్బయిపోయాడు. పొంగి పొర్లిన సంతోషం పట్టలేక కొడుకు చేతిలో ప్రాణాలు వదిలాడు.

తండ్రి పోయాడని గంగరాజు ఆఫీసు పని మానలేదు. పోయిన మర్నాడూ, పదకొండో రోజు తప్ప మిగతా రోజులు ఆఫీసుకి హాజరయ్యాడు.

విలువైన పనిగంటలు వదల బుద్ధి కాని ఆఫీసు సిబ్బంది సెలవు పెట్టడం అరుదు. నలతగా ఉంది మూడు రోజులు సి. ఎల్. పెట్టిన అసలు టీ-వన్ క్లర్కు వైరస్ ఫీవర్ తగిలి పదిహేను రోజులు సిక్ లీవుకి అప్లయి చేసాడు. ఈ లోగా గంగరాజు సీటుని ఓ వూపు వూపాడు.

ఆఫీసు అట్టుడికినట్టు ఉడికి పోయింది. అంతా సజావుగా జరిగితే-న్యాయబద్ధంగా సంపాదించుకుంటే వాళ్ళకి అభ్యంతరం లేదు. అసలు మనిషి 'అబ్సెన్స్' లో 'సంపాదన' అన్యాయం అని నిరసించారు. పీకలు మొయ్యా కోపాలు పెంచుకున్నారు అతని మీద.

'నిన్నగాక మొన్న ఉదయించిన జూనియర్ గుమాస్తా సూర్యుడు, వయసేం మించిపోయిందని దబ్బు యావః' అని వ్యాఖ్యానించారు. అందుకని గంగరాజుని సాంఘికంగా బహిష్కరించారు.

గంగరాజు వాళ్ళని కేర్ చెయ్యలేదు. అతని ఆలోచన వేరు___ దొరక్క దొరికిన సీటుని శాశ్వతంగా ఎలా దక్కించుకోవాలా- అని.

ఆ మర్నాడే టీ వన్ జాయినవ్వాల్సిన రోజు. అంతకు ముందు రాత్రి తీవ్రంగా ఆలోచించాడు. ఓ పథకం తట్టింది. తరువాత ఉపాయం ఆచరణలో పెట్టాడు.

ఆ రోజు జాయినింగ్ రిపోర్టిచ్చి తన సీట్లోకి రాబోయిన బీ-వన్ క్లర్కు, కుర్చీలో కూర్చున్న గంగరాజుని జుగుప్సగా చూసి "ఏమ్మా! సీటు ఖాళీ చెయ్యాలని లేదా? అంటుకుపోయావ్!" అన్నాడు.

అప్పటికే ఆనోటా ఈనోటా గంగరాజు ఘనత విన్నాడు. జ్వరంకంటె ఈ బెంగ అతన్ని క్రుంగదీసి శెలవు పొడిగింప జేసింది.

గంగరాజు నవ్వి వూరుకున్నాడు. ఇంతలో ప్యూన్ వచ్చి అతన్ని వెనక్కి పిలిచి "అయ్యగారు రమ్మన్నారు" అన్నాడు.

బీ-వన్ ఆయన గదిలోకి వెళ్ళాడు.

ఆఫీసర్ "ఆ! మరిచాను. గంగరాజు బీ-వన్ సీటుచూస్తాడు. నువ్వు డిస్పాచ్ సీటు చూసుకో" అన్నాడు.

బీ-వన్ కళ్ళెర్ర బడ్డాయి. "ఏమిటి మీరు మాట్లాడేది?" అన్నాడు. ప్రతిగా ఆఫీసరు కళ్ళెర్ర జేశాడు. ఈ ఆఫీసరు గుమస్తాల మీద తిరగబడ్డం యిదివరకు జరగలేదు. బీ-వన్ అదిరిపోయాడు. కోపం చల్లార్చుకుని జాలిమొహం పెట్టి దీనంగా అడిగాడు.

"సార్! యిది అన్యాయం. పిల్లలుగలవాణ్ణి."

"అదంతే. నో ఆర్గ్యుమెంట్!" పైగా "యూ కెన్ గో" అంటూ పెన్సిల్‌తో దారి చూపించాడు.

ఆఫీసర్ నసాళానికి అంటింది క్రూరత్వం. అలవర్చుకుని యింకా యిరవై నాలుగ్గంటలు కాలేదు. గత రాత్రి ఆయన భార్య "మీరు దబ్బు పుట్టకపోతే ఆత్మహత్య చేసుకుంటా" నంది. అదిలించింది. బెదిరించింది. మనసు మార్చుకోక తప్పలేదు. దానికి కారణం కూడా వుంది.

"వెధవలు మీ పేరు చెప్పుకుని పందికొక్కుల్లా మేస్తున్నారట. నాకు అది పట్టుకుంది. ఖర్మ! ఇంత అన్యాయమా? మా వూరి గుమస్తాగాళ్ళు మిమ్మల్ని ఎంత చాతకాని వాణ్ణిగా జమకట్టి వదిలారో చూసారా? ఆ కుర్రాడు-గంగరాజు కదూ-అతను పూసగుచ్చినట్టు చెప్పాడు. హవ్వ!! యింత వేడి తగులుతూంటే కదలకుండా ఆఫీసు గదిలో ఎలా పడివున్నారండీ? ఆ కుర్రాడు నా బిడ్డలా-కన్నతల్లికి పెట్టినట్టు ఐదువందలు చేసే పట్టు చీర తెచ్చి నా చేతుల్లో పెట్టి కాళ్ళ ద్దుకున్నాడు. 'మీలో నా తల్లిని చూస్తున్నా'నంది. అందుకే ఆఫీసు

విషయాలు చెప్పకుండా వుండలేక పోయా' నన్నాడు. మాట్లాడరేం మొద్దురాచ్చిప్పలా? డబ్బు ముడ తారా, లేక నా శవం కళ్ళ జూస్తా...."

"ఆగు కాత్యాయనీ!" అంటూ భయంకరంగా అరిచాయన. ఆ అరుపులోనే మార్పు మొగ్గ తొడి గింది. ఆ క్షణాన గంగరాజు తన భార్యకే కాక తనకే బిడ్డయ్యాడు. "మీకేం భయంలేదు సార్! ఆఫీ సంతా స్ట్రయిక్ చేసినాసరే, ఒంటి చేత్తో కాగితాలు డిస్పోజ్ చెయ్య గలను" అని హామీ యిచ్చాడు గంగరాజు.

జాగిలాల్లా ఆఫీసు గుమాస్తాలు ఈ విషయం కనిపెట్టారు. దంగై పోయారు. వాళ్ళ దృష్టికి గంగ రాజు అపుడే వుదయించిన సూర్యు డిలా లేడు - మిట్ట మధ్యాహ్నపు ప్రచండ భానుడిలా, వున్నాడు. సర్వీసు సంవత్సరం, గొప్ప అను భవం సంపాయించి ఆఫీసు స్థితి గతులు మార్చేసాడు.

పార్టీలు డైరెక్టుగా గుమాస్తాల్ని కలుసుకునే పద్ధతి రద్దయింది. అంతా ఆఫీసరుగార్ని దర్శించుకుని ఆయన కేటాయించిన గుమాస్తాని కల్సుకోవాలి. సదరు గుమస్తా 'నిర్ణయించిన రేట్లు' ప్రకారం సమర్పించుకోవాలి. ఆఫీసరు తనకి ప్రమాదంలేని ఫక్కీలో-గుమస్తా వచ్చి అందులో మూడొంతులు సమర్పిస్తాడు. ఓవంతు తను తీసు కోవచ్చు. మోసానికి తావు లేదు. బిళ్ళ బంట్రోతులు 'వేగు' పని చేస్తారు. అంతా గంగరాజు ప్రణా ళిక. అతనికి 'రూల్సు' వర్తించవు- 'కన్నబిడ్డ' గాబట్టి.

గంగరాజు అత్యున్నతమైన సీ-ఫోర్ సీట్లోకి బదిలీ అయ్యాడు. నెలకు ఐదువేలు నికరాదాయం. చెక్క పేళ్ళలా వచ్చి పడతాయి. సీ-ఫోర్ బీ-వన్‌లోకి పుసూడు మంటూ మారాడు. గంగరాజు పని మూడు పూలు ఆరు కాయలుగా వుంది.

అన్నట్టు 'కాయ' అలవా టైంది. సిగరెట్ చిన్ననాటి అల వాటే. పేకాట స్కూల్ డేస్‌లోనే నేర్చుకున్నాడు.

డబ్బుకి పని తగిలింది.

* * *

రెండేళ్ళు గడిచాయి.

చూశారా- గంగరాజు సంపా దనముందు - ఈమధ్య కాలంలో అతనికి పెళ్ళయిందని, యిద్దరు పిల్ల లని చెప్పాలనుకున్న విషయం మరుగున పడిపోయింది.

అతనికి గట్టిగా గడించి మేట

వేయించాలని బలవత్తరమైన కోరిక వుంది.

'బులెట్' పెట్రోలుకి అతని జీతం సరిపోతుంది. కాల్చే సిగరెట్లకి నూటయాభై....విత్యం గొంతు తడుపుకోడానికి రోజుకు సగటున యాభై....నెల నెలా పెళ్ళాం బట్టలు, స్టీలు కొట్లలో పెంచే బిల్లు చెల్లించాలా? యిది కాక 'రెండో సంసారం' స్థాపించాడు.

వెనకెయ్యడం వీలు పడలేదు. తండ్రి నయం-తన స్కూటరుకి పదెకరాలు సంపాయించాడు. తను సెంటు భూమి కొనలేక పోయాడు.

అది అలా ఉండగా-భూకంపం జరిగినట్టు ప్రజల్లో ఆ డిపార్టుమెంటు మీద అలజడి చెలరేగింది. చాలా చెడ్డ పేరు వచ్చింది.

డిపార్టుమెంటుని ప్రక్షాళనం చేసి పునర్వ్యవస్థీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పాత ఆఫీసర్లని 'షాట్‌పుట్' లా దూరంగా విసిరి, కొందరికి డిస్మిసల్స్, కొందరికి కంపల్సరీ రిటైర్మెంట్లు ప్రసాదించారు. లావా చెలరేగింది. చాకుల్లాంటి- మెరికల్లాంటి 'యువ' ఆఫీసర్లని కొత్తగా పోస్టు చేసారు. దెబ్బకు దెయ్యం దిగింది. గుమస్తా ప్రపంచం వడదెబ్బ తింది. 'బ్రతుకుజీవుడా! మిగిలింది చాలు' అనుకుని కాళ్ళు ముడుచుకున్నారు.

గంగరాజులాంటి తెగువరులు-జిల్లాకి ఒకడూ, అరా ఆగక-పైగా విజృంభించాడు. వంద లంచాన్ని పదింతలు పెంచి పనులు సాధించారు.

గంగరాజు దుమారం కొత్త ఆఫీసర్ చెవిదాకా వెళ్ళింది. జాయినయిన రెండు వారాలకి వాసన పసిగట్టాడు.

ఫలితంగా కాలింగ్‌బెల్ కొంప ముంచి ముద్దాయిని గదిలో ప్రవేశ పెట్టింది.

"మిస్టర్ గంగరాజూ! అందరూ తుక్కిన పేలయి లంచాలు మానుకున్నారు. నీ ధైర్యం నాకు ఆశ్చర్యం కలిగిస్తూంది!"

"............"

"దేశంలో సామాన్యుడి స్థితి సన్నగిల్లడానికి బక్కవాడి పరిస్థితి నానాటికి దిగజారిపోవడానికి కారణం-పరోక్షంగా నువ్వు, నీలాంటి లంచగొండులంటె నమ్ముతావా? మన దేశంలో దారిద్ర్యం పెరగడానికి ఇదో ప్రధాన కారణమని నీకు తెలియకపోవచ్చు."

"............"

"మిస్టర్ గంగరాజూ! యిది

స్నేహపూర్వకమైన హెచ్చరిక. దీనితో సరిపెట్టుకునే అధికారం లేకపోయినా....వార్నింగ్‌తో వదిలి పెడ్తున్నా. యిదే మొదటిదికూడా. కరెక్ట్ యువర్ సెల్ఫ్!" అన్నాడు కొత్త ఆఫీసర్.

బట్టలు దులుపుకుని బైటపడ్డాడు గంగరాజు. అతనికి లెక్కలేదు. లక్షో రెండు లక్షలో వెనకేసివుంటే అసలే లక్ష్యం లేకపోను. 'అదే నా పోరటాటు' అనుకున్నాడు. అతను వ్యాపకం మానలేదు. కాక పోతే తగ్గించాడు. లేదా రహస్యంగా నడిపాడు.

ఆఫీసర్ చటుక్కున—గంగ రాజుని—సీట్లోంచి తప్పించి డిస్పాచ్ సీటుకి బదిలి చేసాడు.

గంగరాజుకి తల కొట్టేసినంత పనయింది. ఏ సీటులో గుమస్తా జీవితం ప్రారంభించాడో....చివరికి ఆ సీటుకి బదిలీ!

అంతా పండుగ చేసుకున్నారు ఎవరికీ ఏమీ ఒరగకపోయినా. మాజీ టి-వన్ క్లర్కు సరేసరి-చాక్లెట్లు పంచిపెట్టాడు.

గంగరాజు అహం దెబ్బ తింది. ఇక ఏ పని చెయ్యడాని కైనా సిద్ధపడ్డాడు. ఏ కళంకం ఎరగని సీట్లో కూడా బంగారం తవ్వ గల టెక్నిక్ అతనికి తెలుసు. ఎంత పనికిమాలిన సీటునైనా తన కనుగుణంగా మార్చుకోగలడు.

అందుకే డిస్పాచ్ సీటులో డబ్బు సంపాయించే ప్రక్రియ ప్రారంభించాడు.

డిస్పాచ్‌కి వచ్చే కాగితాలు ఆగి పోతున్నాయి. పార్టీలు కదిలి వచ్చి 'సీటు' తడిపితే అవి కదులు తున్నాయి. గుమస్తాలు నోళ్ళు తెరిచారు. ఈ విషయం పాకి ఆఫీసర్ చెవిని కాజేసింది. ఆ రాత్రల్లా ఆఫీసర్ అతలకుతలమైపోయి ఆలోచించాడు—

మర్నాడు....

ఆఫీసర్ దగ్గరనుంచి 'డిస్పాచ్' కి వచ్చిన ఓ కాగితాన్ని నొక్కిపట్టాలనుకుని దానిమీద తన అడ్రసు చూసి ఆశ్చర్యపోయాడు గంగరాజు. ఆ తరువాత మేటర్ చదివి శిలాప్రతిమ అయిపోయాడు.

అది ఏమిటో అయితే గొడవెందుకు? గంగరాజుని ఉద్యోగం లోంచి తొలగిస్తూ 'ఆర్డర్స్'. స్టాఫ్ భాషలో 'మిడిపిపడ్డ గుమస్తా సూర్యుడు అస్తమించాడు.' *

